ఈనాడు
కర్నూలు
గురువారం అక్టోబరు 24, 2024

డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు హోల్‌సేల్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షించారు. హొళగుంద మండలం నెరణికి చెందిన తోటదళ బసవేశ్వర గ్రూపు ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారుచేసిన జ్యూట్ బ్యాగులు పరిశీలించారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో మార్కెట్‌ను ఏపీఎంలు అధ్యయనం చేసి ఆయా దుకాణాలు, సూపర్‌మార్కెట్‌లలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలని ఆదేశించారు. పది రోజుల్లో దీనికి సంబంధించిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీవో హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : జిల్లాలో వినియోగదారులకు ఇసుక ఉచితంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ జి.బిందుమాధవ్, మైనింగ్ శాఖ డీడీ రవిచంద్‌తో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రజలందరికి మేలు చేసేందుకు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలుచేస్తోందని పేర్కొన్నారు. ఇది సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన ఇసుకను రీచ్‌ల వద్ద నుంచే కాక ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చన్నారు. నదీ సమీప గ్రామాలు, పట్టణాలకు చెందినవారు తమ నిర్మాణ అవసరాలకు ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లొచ్చని పేర్కొన్నారు. పొక్లెయిన్లతో ఇసుక తవ్వి ఒకేచోట నిల్వ చేసి అక్రమంగా సంపాదించాలని చూస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇసుక తవ్వి జిల్లా సరిహద్దులు దాటించాలని చూస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాగు బడిలో ద్రోణాచార్యులు

■ సేద్యానికి సాంకేతిక ఊతం




డ్రోన్ల వినియోగంపై సర్కారు దృష్టి

డ్రోన్ చేతిలో ఉంటే.. ఎకరం పొలంలో ఎనిమిది నిమిషాల్లో 'విత్తు'కోవచ్చు... ఐదు నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేయొచ్చు.. చేనుకు వ్యాపించి చీడపీడల చిత్రాలు తీసి క్షణాల్లో సలహాలు పొందొచ్చు.. నిత్యం పది ఎకరాల పొలంలో పురుగు మందులు పిచికారీ చేసి రూ.ఐదు వేల వరకు సంపాదించొచ్చు.!! ఇప్పటికే పలువురు యువకులు డ్రోనాస్త్రంతో ఉపాధి పొందుతున్నారు. 'కూటమి' ప్రభుత్వం తాజాగా తీసుకొన్న నిర్ణయాలతో మరింత మంది స్వయం ఉపాధి పొందడానికి మార్గం సుగమమైంది. 10 లక్షల హెక్టార్లలో 7.31 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగుకు ఊతం ఇవ్వనుంది.

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే

ఓర్వకల్లులో ప్రత్యేక హబ్

'కూటమి' ప్రభుత్వం సాంకేతిక రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఫొటోగ్రఫీ, వ్యవసాయం, నిర్మాణ, రవాణా, విపత్తుల నిర్వహణలో డ్రోన్ల సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. వీటిపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తోంది. డ్రోన్ల వినియోగం పెంచేందుకు అడుగులేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా, అమరావతిని డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. డ్రోన్ హబ్ అభివృద్ధి కోసం ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.



15 రోజులు ప్రత్యేక శిక్షణ

విక్రయసంస్థలు 15 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ గుంటూరులోని లాంఫామ్‌లో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రం అందజేస్తోంది. ఇటీవల ప్రైవేటు శిక్షణా కేంద్రాలూ వెలిశాయి.

విత్తుకో వచ్చు

డ్రోన్ సాయంతో విత్తనాలు విత్తుకోవచ్చు.. ఇందులో ఉంటే కంటెయినర్ (డబ్బా) పది లీటర్లు/ పది కిలోల బరువు మోస్తుంది. డబ్బాలో విత్తనాలు నింపి చల్లొచ్చు.. 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. సుమారు 265 అడుగుల ఎత్తు ఎగురుతుంది. ఎకరా భూమికి సరిపడా విత్తనాలు ఎనిమిది నిమిషాల వ్యవధిలో చల్లుతుంది.

యువతకు ఉపాధి

వినియోగంపై 15 రోజులపాటు శిక్షణ పొంది డ్రోన్ కొనుగోలు చేస్తే పంటల సీజన్‌లో సొంత గ్రామంలో ఉండి రోజుకు రూ.వేలు సంపాదించొచ్చు. పంట పొలాలకు పురుగు మందు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.500 చొప్పున ఒక రోజులో 10 ఎకరాలు పిచికారీ చేస్తే రూ.5 వేలు సంపాదించొచ్చు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వంద మంది వరకు ఇలా ఉపాధి పొందుతున్నారు. జి.సింగవరంలో రాఘవేంద్ర గౌడ్ ప్రస్తుత సీజన్‌లో 1,800 ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేసి రూ.9 లక్షల ఆదాయం పొందారు.

డ్రోన్ సామర్థ్యాన్ని బట్టి గరిష్ఠంగా నిత్యం 75–100 ఎకరాల్లో మందులు పిచికారీ చేయొచ్చు. క్రిమి సంహారక మందు మొక్క అడుగు నుంచి పైవరకు తడుస్తుంది. ఎకరా పొలంలో 5–10 నిమిషాల్లోనే పూర్తవుతుంది.

సాధారణ స్ప్రేయర్లతో ఎకరా పొలంలో పురుగు మందుల పిచికారీకి 5–6 గంటల సమయం పడుతుంది. కూలీలైతే ఇద్దరికి రూ.500 నుంచి రూ.800 వరకు చెల్లించాల్సి వస్తుంది. డ్రోన్ల ఆపరేటర్లు రూ.450–500కు సేవలందిస్తున్నారు.

స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే.. డ్రోన్‌తో 10 లీటర్లు సరిపోతుంది.

ఖరీదు రూ.6 -రూ.10 లక్షలు

ఒక డ్రోన్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. డ్రోన్‌కు ఉపయోగించే బ్యాటరీ ఒక్కొక్కటి రూ.40 వేలు ఉంటుంది. నాలుగైదు బ్యాటరీలు కొనుగోలు చేసి వినియోగిస్తే 10-20 ఎకరాల పంటను పిచికారీ చేసేందుకు వీలవుతుంది. పంట పొలాల వద్ద బ్యాటరీలను ఛార్జింగ్ చేసుకునేందుకు వీలులేకపోవడంతో రూ.30 వేలు వెచ్చించి జనరేటర్ తీసుకోవాల్సి ఉంటుంది.

రాయితీ ఇస్తారు

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకాల ద్వారా 40 శాతం ఇస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ల వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకులు రూ.5 లక్షలు రుణంగా ఇస్తున్నాయి. పది శాతం రైతు సంఘాలు, లేదా స్వయం సహాయక సంఘాలు భరించాల్సి ఉంటుంది.

మహిళలకు దీదీ పథకం

నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా కేంద్రం ఉచితంగా డ్రోన్లు అందజేస్తోంది. కర్నూలు జిల్లాలో తొమ్మిది పొదుపు సంఘాల మహిళలకు దిల్లీ, హైదరాబాదులో శిక్షణ ఇచ్చారు. తొమ్మిది మంది మహిళలకు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్లను ఉచితంగా పంపిణీ చేశారు.

బృందం.. ఆనందం


డ్రోన్‌తో నల్లారెడ్డిస్వామి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు

గోనెగండ్ల మండలం కులుమాలకు చెందిన కొందరు రైతులు నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తి సంఘంగా ఏర్పడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదీదీ పథకం కింద రూ.7.40 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. ఎకరానికి రూ.400 అద్దె వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 700 ఎకరాల్లో రసాయన మందులు పిచికారీ చేశారు. 10 లీ. నీటి ట్యాంకుతో ఎకరం పొలం 5 నిమిషాల్లో పిచికారీ చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. – గోనెగండ్ల, న్యూస్‌టుడే

50 రోజులు రూ.3 లక్షలు



"ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేశా. ఏడెకరాల పొలం ఉంది.. మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాం.. పంటలపై మందుల పిచికారీలో ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి 70 రోజుల కిందట రూ.6 లక్షలు వెచ్చించి డ్రోన్ కొనుగోలు చేశా. నిత్యం 35 నుంచి 40 ఎకరాల్లో మందులు పిచికారీ చేస్తున్నా. ఎకరానికి రూ.400 తీసుకుంటా. గత 50 రోజుల్లో ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షలకు పైగా సంపాదించాను" అంటున్నారు కోసిగి మండలం గంటెల మాంతేష్. – న్యూస్‌టుడే, కౌతాళం

మొదటి వ్యక్తిని నేనే


డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న నజీర్

"మాది శిరివెళ్ల.. ఇంటర్మీడియట్ చదివాను.. రూ.6 లక్షలు వెచ్చించి 2020లో డ్రోన్ కొనుగోలు చేశా. దీని నిర్వహణపై పుణెలో వారం రోజులు శిక్షణ తీసుకున్నా.. మొదట్లో నిత్యం 20 నుంచి 30 ఎకరాల్లో పంటలకు మందులు పిచికారీ చేసేవాడిని.. నెలకు రూ.లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఇక్కడ పని లేకపోతే కర్ణాటక, గోవా ప్రాంతాలకు వెళ్లి మందులు పిచికారీ చేసేవాడిని. జిల్లాలో డ్రోన్ వాడిని మొదటి వ్యక్తిని నేనే. ఎకరం పొలాన్ని ఐదు నిమిషాల్లో పూర్తి చేయొచ్చు.. ప్రస్తుతం వీటి సంఖ్య పెరగడంతో ఎకరానికి రూ.400 అద్దె తీసుకుంటున్నా... వీటికి మరమ్మతులు కూడా చేస్తుంటానని" నజీర్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాణ్యం

ఆనంద క్షణాల్లో విషాద గీతం

■ బంధువుల వివాహ రిసెప్షన్‌కు వెళ్తూ మృత్యు ఒడికి
■ కారును ఢీకొట్టిన ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు
■ ముగ్గురు మృతి.. నలుగురికి గాయాలు


సుచిత్ర (పాతచిత్రం)


వాసవి, ప్రేమ్‌కుమార్ దంపతులు (పాతచిత్రం)

పెళ్లి జరిగి రెండు రోజులు గడిచింది. ఆనందం నిండిన ఆ ఇంట విషాదం ఆవహించింది. మేళతాళాలు మోగిన ముంగిట ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. కుమార్తె అత్తవారింట వేడుకకు సంతోషంగా మొదలైన ప్రయాణం.. అర్ధాంతరంగా ముగిసింది. రహదారి ప్రమాదం మూడు ప్రాణాలను చిదిమేసింది. రెండు కుటుంబాలను కన్నీటిపాలుచేసింది. మరణంలోనూ ఆ దంపతుల బంధం వీడలేదు. కలిసి జీవించిన వారు.. కలిసే కన్నుమూశారు. ఆనంద వేడుక.. విషాదంగా మారింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. మరో నలుగురు క్షతగాత్రులుగా మారారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవార్తలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కర్నూలు నగరంలోని షరాఫ్ బజార్‌కు చెందిన బంగారం వ్యాపారి, ఉడ్‌లాండ్స్ లాడ్జీ యజమాని కామిశెట్టి గురవయ్య ఇంట విషాదం నెలకొంది. ఆర్యవైశ్యులందరికీ సుపరిచితుడైన గురువయ్యకు ముగ్గురు కుమారులు రాజేష్, మహేష్, జగదీష్ ఉన్నారు. రాజేష్ కుమార్తె సిరిచందన (న్యాయవాది)కు తిరుపతికి చెందిన రోహిత్‌తో ఈ నెల 20న కర్నూలులో వివాహం జరిగింది. 24వ తేదీన తిరుపతిలో రిసెప్షన్ నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వాహనాల్లో బుధవారం కర్నూలు నుంచి బయల్దేరారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వద్ద మైసూరివారిపల్లె సమీపంలో తిరుపతి నుంచి కడప వైపు ఎదురుగా వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో నవ వధువుకు పిన్ని వరస అయిన సుచిత్ర(49), వారి బంధువులు కళాక్షేత్ర సిల్క్‌హౌస్ యజమాని ప్రేమ్(55), ఆయన భార్య వాసవి(45)ని తిరుపతిలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. నలుగురు చికిత్స పొందుతున్నారు.



ఉల్లి వరుస లొల్లి

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఉల్లి దిగుబడులు పోటెత్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పలు వాహనాలు, ఎడ్ల బండ్లల్లో ఉల్లి దిగుబడులను పెద్దఎత్తున తీసుకొచ్చారు.. మరోవైపు గత రెండు రోజులుగా ఈ-నామ్‌కు సర్వర్ సమస్యలు వేధిస్తుండటంతో వ్యాపార లావాదేవీలు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్‌లో దిగుబడులు పేరుకుపోవడంతో స్థలం లేక ఉల్లి బస్తాలు తీసుకొచ్చిన వాహనాలు నగరంలో అటు బస్టాండు ప్రాంతం, ఇటు అశోక్ నగర్ వెళ్లే మార్గంలో బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో బారులుదీరాయి. – ఈనాడు, కర్నూలు

2 నుంచి శ్రీశైలంలో కార్తిక మాసోత్సవాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. భక్తుల రద్దీ కారణంగా అభిషేకం టిక్కెట్లు , శని, ఆది, సోమవారం, పర్వదినాల్లో స్పర్శ దర్శనాన్ని నిలుపుదల చేసినట్లు వివరించారు.

ఊరి బడికి ఊరట

■ వైకాపా తీసుకొచ్చిన జీవో 117 రద్దు
■ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం

'విలీనం' పేరుతో గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసింది.. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ఊరి బడికి ఉరేశారు.. విద్యార్థులు ప్రైవేటు బడి బాట పట్టారు.. ఫీజుల భారం భరించలేక కొందరు చదువుకు దూరమయ్యారు.. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేయాలని నిర్ణయించింది. జీవో 117 రద్దుతో ఊరి బడి (ప్రాథమిక పాఠశాల)కి ఊపిరి పోసినట్లైందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకానికి జీవో 53 అమలవుతుంది. 98 మంది కంటే తక్కువ పిల్లలున్న ఉన్నత పాఠశాలలకు కొత్తరూపు రానుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తారు.

30 వేల మంది ప్రైవేటు బాట

గత వైకాపా ప్రభుత్వం ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారింది. ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో సర్కారు బడుల్లో చేరేవారి సంఖ్య తగ్గిపోయింది. వేలాదిమంది ప్రైవేటు పాఠశాలల బాట పట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నాలుగేళ్లలో సుమారు 30 వేల మంది చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వెళ్లిపోయారు. దీంతో ఏటా పదుల సంఖ్యలో ప్రాథమిక బడులు మూతపడుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం విలీనం ప్రక్రియను రద్దు చేసింది.



నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఆ పాఠశాలలో ఒక్క విద్యార్థే మిగిలారు.. ఆ బాలుడు దివ్యాంగుడు. ఈ ఏడాది విద్యార్థులు, ప్రవేశాలు లేకపోవడంతో పాఠశాలకు తాళం వేశారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:

పాఠశాల మనుగడే ప్రశ్నార్థకం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 276 ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో సుమారు 167 పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు మిగిలారు.
- 97 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ చేరలేదు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 8 వరకు ఉన్నాయి.
- 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లతో బోధన అందిస్తామని జగన్ సర్కారు గొప్పలు చెప్పింది. ఆచరణలో విఫలమైంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 723 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. మరోవైపు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల సంఖ్య పెరిగిపోయింది.
- కర్నూలు జిల్లాలో పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 23 ఉన్నాయి. ఆలూరు మండలం పెద్దహోతూరు ప్రాథమిక పాఠశాల, హాలహర్వి మండలం చిన్నహోతకుంట, కోడుమూరులోని బోయగేరి, మండలంలోని లద్దగిరి, మండల కేంద్రం కోసిగిలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఐదుగురిని మించిలేదు.
- నంద్యాల జిల్లాలోని 98 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పదిమంది లోపే ఉన్నారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల్లో ఒక్క విద్యార్థే ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఐదో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 26వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ప్రభుత్వ ఐటీఐ, 29న ప్రైవేటు ఐటీఐ కళాశాలల అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుంది.

రోళ్లపాడు రమ్మంటోంది

✤ పర్యాటకుల విడిదికి ఏర్పాట్లు ✤ నవంబరు 1 నుంచి సందర్శన

పక్షి జాతుల సందడి.. కృష్ణజింకల పరుగులు.. దుప్పుల గంతులు.. అడవి తోడేళ్ల అరుపులు.. పక్షుల కిలకిలరావాలు.. ఆఫ్రికన్ సవన్నా ప్రాంతాన్ని తలపించే రోళ్లపాడు అభయారణ్యం ప్రకృతి అందాలు తిలకించడానికి అటవీ శాఖ ఆహ్వానం పలుకుతోంది. మిడుతూరు మండలంలో నెలకొన్న ఈ అభయారణ్యాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. పక్షి ప్రేమికులకు కనువిందు చేయనుంది. నల్లమల అటవీ ప్రాంతం, పక్షులు, వన్యప్రాణుల సందర్శనలో భాగంగా నవంబరు 1 నుంచి పర్యాటకుల సందర్శనకు సిద్ధం చేస్తున్నారు.

ఆత్మకూరు, నందికొట్కూరు, మిడుతూరు, న్యూస్‌టుడే :

పర్యావరణ విజ్ఞాన కేంద్రం

నల్లమల అరణ్యం విశిష్టతను వివరించేందుకు ఇక్కడ పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నల్లమల వివరాలు, పక్షులు, వన్యప్రాణులు వాటి జీవన విధానంపై అవగాహన పెంపొందించేందుకు డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. రకరకాల పక్షుల వివరాలు తెలిపే చిత్రాలు ఇక్కడ ఏర్పాటు చేశారు.

● విభాగం ● రకాలు


విభాగం	రకాలు
పక్షిజాతులు	202
క్షీరదాలు	21
సరీసృపాలు	27
ఉభయ చరాలు	9
సీతాకోక చిలుకలు	62
తూనీగలు	8


బట్టమేక పక్షులు


హ్యారీర్ పక్షి


ఇండియన్ ఫాక్స్


కృష్ణ జింకలు


శాండ్‌గ్రోస్ పక్షి

బట్టమేక పక్షి సంరక్షణ కేంద్రం

అంతరించి పోయే ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్న పక్షిజాతుల్లో బట్టమేక పిట్ట ఒకటి.. రాష్ట్రంలో 1998లో సుమారు 25 వరకు ఉండేవి.. రోళ్లపాడు ప్రాంతంలో ఇవి కనిపించడంతో కాపాడేందుకు 1988లో అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ పక్షి మూడున్నర నుంచి నాలుగడుగుల ఎత్తు వరకు ఉంటుంది.. గడ్డి మైదానంలో ఎక్కువగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మిడుతూరు మండలం రోళ్లపాడులో 9.37 చ.కి.మీ విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఐదారేళ్ల కిందట బట్టమేక పక్షి వచ్చి గుడ్డు పెట్టి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ రావడం లేదు.

విడిది.. సఫారీ ఇలా

రోళ్లపాడును సందర్శించే పర్యాటకుల సౌకర్యార్థం విడిది కేంద్రం, సఫారీ ఏర్పాటు చేశారు. ఇక్కడ నాలుగు ఏసీ గదులు నిర్మించారు. ఒక్కో గదికి నిత్యం రూ.4 వేలు చెల్లించాలి. ఇద్దరు వ్యక్తులకు వసతి, భోజనం, సఫారీ కల్పిస్తారు. డార్మెటరీలో విడివిడిగా 8 బెడ్లు ఉన్నాయి. ఒక్కో బెడ్‌కు రోజుకు రూ.1500 చెల్లించాలి. డబ్లూడబ్లూడబ్ల్యూ.ఎన్ఎస్‌టీఆర్.కో.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రోళ్లపాడు అభయారణ్యంలో గదులను బుక్ చేసుకోవచ్చు.

సంక్షేమానికి శ్రీకారం.. కార్మికులకు వరం

☛ పథకాల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం చర్యలు
☛ నూతన సభ్యత్వ నమోదు చేపట్టిన అధికారులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమాన్ని పాలకులు గాలికొదిలేశారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. గత ఐదేళ్లుగా కార్మికులకు సంక్షేమ పథకాలు, రావాల్సిన క్లైంలను నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు భరోసా ఇచ్చేందుకు ముందడుగు వేసింది. కార్మికుల సంక్షేమ చట్టం అమలుకు శ్రీకారం చుట్టింది. కార్మిక సంక్షేమ చట్టం ప్రయోజనాలను వివరించేందుకు కార్మిక శాఖ అధికారులు నంద్యాల జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు కార్మికుల నమోదు చేపట్టారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల చట్టం 1996 ప్రకారం కార్మికులు ఈ పథకంలో సభ్యులుగా చేరి గుర్తింపు పత్రాలు తీసుకుంటే ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం లభిస్తుందని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నారు.



జగజ్జనని నగర్‌లో కార్మికుల నమోదు చేపడుతున్న అధికారులు

నమోదైంది 77 వేల మందే

నంద్యాల జిల్లాలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరిలో సుమారు 77 వేల మంది వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నెల వరకు రెన్యువల్ చేసుకున్న వారు 14,009 మంది ఉన్నారు. కార్మిక శాఖ అధికారులు 200 రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలో డిసెంబరు చివరి నాటికి 900 మంది కార్మికులను కొత్తగా నమోదు చేయాల్సి ఉంది. ఇప్పటికే 912 మంది భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులను నమోదు చేశారు.

నమోదు ఇలా..

18 నుంచి 59 ఏళ్లలోపు వయసు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు సంక్షేమ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. వయసు ధ్రువీకరణకు రేషన్‌కార్డు, ఓటరుకార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు జత చేయాలి. ఏడాదిలో 90 రోజులకు తక్కువ కాకుండా భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. ఐదేళ్లకు గాను రూ.110 కార్మికుల నమోదు రుసుం చెల్లించి సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి. కార్మిక శాఖ కార్యాలయంలో రసీదు అందజేయాలి. ఐదేళ్లకు ఒకసారి రూ.60 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి.

వర్తించే పథకాలు

కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందినా లేదా పూర్తిగా వైకల్యానికి గురైనా రూ.5 లక్షలు చెల్లిస్తారు. 50 శాతం, అంతకు మించి వైకల్యానికి గురైతే రూ.లక్ష ఇస్తారు. 50 శాతంలోపు వైకల్యం బారినపడితే రూ.50 వేలు, 25 శాతం వరకు అయితే రూ.25 వేలు ఇస్తారు. సాధారణ మృతికి రూ.60 వేల ఆర్థిక సాయం, అంతిమ సంస్కారాలకు రూ.20 వేలు అందిస్తారు. వివాహితకు ప్రసూతి సాయం కింద రూ.20 వేలు (2 ప్రసవాలకు) చెల్లిస్తారు. ఈ పథకం కార్మికుని భార్య, కుమార్తెకు కూడా వర్తిస్తుంది. అనారోగ్యంతో బాధపడే సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలలో రూ.3 వేలు అందజేస్తారు.

అందరూ సభ్యత్వం తీసుకోవాలి

- బషీరున్నిసా బేగం, కార్మిక శాఖ సహాయ కమిషనరు, నంద్యాల

నంద్యాల జిల్లాలో ఉన్న ప్రతి భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుడు కార్మిక సంక్షేమ చట్టంలో లబ్ధిదారుగా నమోదు చేసుకోవాలి. దీనివల్ల సమస్యలు వచ్చినప్పుడు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు అందుతాయి. కార్మిక సంక్షేమ చట్టంపై అవగాహన కల్పిస్తూ, నూతన సభ్యుల నమోదు చేపట్టాం.

ఆటేదైనా పతకమే!

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధిస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీలత వద్ద మెలకువలు నేర్చుకొని తైక్వాండో, రెజ్లింగ్, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాణిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు పొందుతున్నారు.

మహిత... బహుమతుల విజేత



డోన్‌కు చెందిన మణికుమార్, మాలతి దంపతుల కుమార్తె మహిత కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. ఆటలపై ఆసక్తితో తైక్వాండో, రోప్ స్కిప్పింగ్‌లలో తర్ఫీదు పొందింది. శిక్షణలో మెలకువలు నేర్చుకొని పోటీలకు సన్నద్ధమైంది. గత నెల 30న నంద్యాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని 58 కేజీల విభాగంలో ప్రత్యర్థితో తలపడి మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అందుకు తగినట్లు తర్ఫీదు తీసుకొంది. రాష్ట్రస్థాయి పోటీలు తిరుపతిలో ఈ నెల 6నుంచి 10వ జరగ్గా...అందులోనూ ప్రతిభను చూపింది. ప్రత్యర్థితో తలపడి విజయానికి శ్రమించి ప్రశంసాపత్రం అందుకొంది. ఈఏడాదిలోనే రోప్‌స్కిప్పింగ్ జాతీయస్థాయి పోటీల్లో రాణించి స్వర్ణ పతకాన్ని సాధించింది.

రెజ్లింగ్‌లో ప్రతిభ



అహోబిలానికి చెందిన సుబ్బరాజు, మల్లేశ్వరి దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న కోటకందుకూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. క్రీడలపై ఆసక్తితో రెజ్లింగ్‌లో తర్ఫీదు పొందింది. శిక్షణలో మెలకువలు నేర్చుకొని నంద్యాలలో గత నెల 23న జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటింది. 30 కేజీల విభాగంలో ప్రత్యర్థినిని చిత్తుచేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయవాడలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి ప్రత్యర్థినిని ఓడించి విజయాన్ని దక్కించుకొంది. క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించి పోలీసు కావడమే లక్ష్యమని లక్ష్మీప్రసన్న చెబుతోంది.

విద్యా సమాచారం

బీఈడీ పరీక్షకు 3,943 మంది హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మొదటి ఏడాది ఒకటో సెమిస్టర్ బీఈడీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ బుధవారం తెలిపారు. మొత్తం 4,318 మందికిగాను 3,943 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ఎల్‌ఎల్‌బీ 5, 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రొవిజినల్ మెరిట్ జాబితా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కేజీబీవీ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను rvmssakurnool.blogspot.com లో పొందుపరిచినట్లు డీఈవో శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే 24వ తేదీ సాయంత్రంలోపు జిల్లా విద్యాశాఖలో సరైన పత్రాలతో రావాలని కోరారు.

అంతా పచ్చగా..ఆహ్లాదం మెండుగా

కర్నూలు మండలం పడిదెంపాడు నుంచి పూడూరు వెళ్లే రహదారికి ఇరువైపులా పంట పొలాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మధ్యలో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. పచ్చని ప్రకృతి అందాలు ఆ మార్గంలో వెళ్లే ప్రతిఒక్కరినీ కట్టిపడేస్తున్నాయి. – ఈనాడు, కర్నూలు



రాకపోకలకు ఇక్కట్లు

పట్టణంలోని త్రివర్ణకాలనీలో రోడ్డు మధ్యలో ఇనుప విద్యుత్తు స్తంభం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్తంభానికి ఇరువైపులా దారిలో ఇనుప ఊచలను ఏర్పాటు చేయడంతో ఇబ్బంది కలుగుతోందని నివాసితులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు రహదారి మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



ఎస్సార్బీసీ కాల్వకు గండి



కాల్వకు పడిన గండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల నుంచి గుంజలపాడుకు వెళ్లే దారిలో ఉన్న ఎస్సార్బీసీ పదో బ్లాక్ మేజర్ కాల్వకు బుధవారం గండి పడింది. కట్ట బలహీనంగా ఉండి తెగిపోవడంతో కాల్వలో ప్రవహించే నీరంతా సమీపంలోని పొలాల్లోకి చేరింది. ప్రస్తుతం పొలాల్లో ఎలాంటి పంటలు సాగు చేయకపోవడంతో నష్టం జరగలేదు. కాల్వకు గండి పడిన విషయాన్ని రైతులు సంబంధిత అధికారులకు చెప్పడంతో డీఈ బాబ్జీ, ఏఈ సురేంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పదో బ్లాక్ నీటి సరఫరాను ఆపివేసి వెంటనే గండి పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.

జలపరవళ్లు

■ తుంగభద్ర జలాశయానికి భారీగా వరద

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 1,10,759 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరిందని వెల్లడించారు. భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో 1,05,009 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 21 గేట్లు తెరిచి 89,382 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని వివిధ కాల్వలకు, విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 1631.92 గాను 101.46 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు. గతేడాది ఈ సమయానికి 39.47 టీఎంసీలు నీటి నిల్వ ఉండేదని అధికారులు పేర్కొన్నారు.


మేళిగనూరు వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

కౌతాళం: తుంగభద్ర నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కౌతాళం మండలం మేళిగనూరు వద్ద నదిలో బుధవారం 1.10 లక్షలు క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో 1,06,142 క్యూసెక్కులు రాగా ప్రస్తుతం 101.46 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1,09,074 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు.


జలాశయంలో నిండుగా నీరు

సుంకేసుల జలాశయం 25 గేట్ల ఎత్తివేత

గూడూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర నది వరద నీటితో ఉరకలేస్తోంది. సుంకేసుల జలాశయానికి బుధవారం ఉదయం 45,360 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, సాయంత్రానికి 1,09,730 క్యూసెక్కులు పెరిగింది. దీంతో 25 గేట్లు ఎత్తి నది దిగువకు 1,06,050 క్యూసెక్కులు, కేసీ కాల్వకు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. నదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకురావడంతో గూడూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చామన్నారు. నిండుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో నదీతీరానికి ఎవరూ వెళ్లకూడదని ఆయన సూచించారు.

ఉద్ధృతంగా వేదవతి

హొళగుంద, హాలహర్వి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు గ్రామమైన మార్లమడికి వద్ద ఉన్న వేదవతి నదికి వరద నీరు పోటెత్తింది. కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండంతో హగరికి నీరు చేరుతోంది. వేదవతి హగరిపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామం వద్ద వేదవతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా వంతెన నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉన్నా.. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు దృష్టిసారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నది పక్కనే ఉన్న పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదవతి

ప్రతిభ చాటాలి.. అగ్నివీరులవ్వాలి



◆ కడపలో వచ్చే నెల 10 నుంచి ర్యాలీ
◆ దళారుల విషయంలో అప్రమత్తత అవసరం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: అగ్నివీర్ నియామకాల ప్రక్రియకు సమయం దగ్గర పడుతోంది. వివిధ పోస్టులకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో ప్రకటన విడుదలైంది. ఫిబ్రవరి 13 నుంచి మార్చి 22వ తేదీ వరకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 2 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు మాజీ సైనిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు నవంబరు 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగే అగ్నివీర్ ర్యాలీకి హాజరవ్వాల్సి ఉంటుంది.

ఉద్యోగాల పేరుతో..

అగ్నివీర్‌కు సంబంధించి ఎక్కువ పోస్టులు ఉండటం.. ప్రకటన విడుదల కావడంతో దళారులు రంగంలో దిగారు. అమాయకులైన అభ్యర్థులను మభ్యపెట్టి ఉద్యోగాలిస్తామంటూ మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల పేరుతో దళారులు డబ్బులు వసూలు చేసే అవకాశముందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్మీ అధికారులు సూచిస్తున్నారు.



సత్తా చాటితేనే..



☛ వివిధ ఉద్యోగాలకు సంబంధించి హాజరయ్యే అభ్యర్థులు 162 నుంచి 165 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలి. ఛాతి 77 సెం.మీ. ఉండి.. గాలి పీల్చితే ఐదు సెం.మీ. పెరగాలి. కనీసం 60 కిలోల బరువు ఉండాలి.

☛ పరుగును రెండు విభాగాల్లో నిర్ణయించారు.. గ్రూప్ 1 కేటగిరీలో 1.6 కి.మీ. పరుగును 5.30 నిమిషాల్లో పూర్తి చేస్తే 10 మార్కులు ఇస్తారు. గ్రూప్-2 కేటగిరీలో 1.6 కి.మీ. పరుగును 5.31 నిమిషాల నుంచి 5.45 నిమిషాల్లో పూర్తి చేస్తే 9 మార్కులు ఇస్తారు.

ఇవి ఉంటే అదనపు మార్కులు

ఎన్‌సీసీ 'ఎ' పత్రం ఉన్నవారికి 5 మార్కులు, 'బి' పత్రం ఉన్నవారికి 10, ఎన్‌సీసీ 'సి' పత్రం ఉంటే 20 మార్కులు, దిల్లీ స్థాయిలో పరేడ్‌లో పాల్గొన్నవారికి 25 మార్కులు కేటాయించారు. క్రీడా పత్రాలు ఉన్నవారికి సైతం కొన్ని మార్కులు నిర్ణయించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, స్థాయి పోటీల్లో పాల్గొన్నవారికి కొన్ని పాయింట్లు ఇస్తారు.

ఇవి తప్పనిసరి

అగ్నివీర్ ర్యాలీకి హాజరయ్యేవారు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిట్ కార్డు ప్రింటు తీసుకోవాలి. వీటితోపాటు అంతర్జాలంలో డౌన్‌లోడ్ చేసిన పత్రాలను సైతం తీసుకెళ్లాల్సి ఉంటుంది. అవసరమైతే.. గెజిటెడ్ అధికారితో అటస్టేషన్ చేయిస్తే మేలు. ఈ పత్రాలు చూపితేనే ర్యాలీలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. లేకుంటే ఇబ్బందులు తప్పవు. ఉదయం 5 గంటల నుంచే ర్యాలీ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని మాజీ సైనిక అధికారులు వెల్లడించారు.

పారదర్శకంగా నియామకాలు

- కల్నల్ పునీత్‌కుమార్, గుంటూరు ఆర్మీ నియామక కార్యాలయ డైరెక్టర్

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు కడప డీఎస్‌ఏ స్టేడియంలో ర్యాలీ జరుగుతుంది. నియామకాలు పారదర్శకంగా జరుగుతాయి. అర్హులందరికీ న్యాయం జరుగుతుంది. మోసగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.


సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో వలసల నివారణ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణంతో వలసలు నివారణ సాధ్యమని పశ్చిమ ప్రాంత అభివృద్ధి పోరాట వేదిక కన్వీనర్ ఆదినారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మిగనూరులోని ఎన్జీవో భవనంలో పశ్చిమ ప్రాంతం వెనుకబాటుతనం.. అభివృద్ధి అవకాశాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పశ్చిమ ప్రాంతం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఈ ప్రాంతంలో ఏటా వలసలతో గ్రామాలు ఖాళీ అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ నాగన్న మాట్లాడుతూ... పశ్చిమ ప్రాంతం వెనుకబాటుతనంపై రైతులు, విద్యార్థులు అందరూ సంఘటితంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌రెడ్డి, నక్కలమిట్ట శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి, యేసేపు, పంపన్నగౌడ్, రంగన్న, భూషణం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

అభివృద్ధికి సహకారం ముఖ్యం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని ఆర్డీటీ ఛైర్మన్ మాంచో ఫెర్రర్‌ను ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. అనంతపురంలోని ఆర్డీటీ కార్యాలయంలో బుధవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, పాఠశాలలు, వైద్యశాలలు ఏర్పాటుచేయాలని కోరినట్లు చెప్పారు.


ఆర్డీటీ ఛైర్మన్ మాంచో ఫెర్రర్‌తో ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. ఆమె బుధవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తోందని చెప్పారు. డ్రోన్ హబ్ ఏర్పాటుతో చాలామందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

డ్రోన్ సాంకేతికత ఎంతో అవసరం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : దేశాభివృద్ధికి డ్రోన్ టెక్నాలజీ ఉపయోగం ఎంతో అవసరమని ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం) రిజిస్ట్రార్ గురుమూర్తి అన్నారు. అమరావతిలో జరిగిన డ్రోన్ల ప్రదర్శనలో కర్నూలు ట్రిపుల్ ఐటీ కళాశాలకు చెందిన డాక్టర్ కేవీ ఈశ్వర్‌మూర్తి ఆధ్వర్యంలో డ్రోన్ ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని బుధవారం చెప్పారు. హ్యాకథాన్ పోటీల్లో రెండో బహుమతి కింద రూ.50 వేల నగదు బహుమతిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తోటి ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



సీఎం చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న డాక్టర్ కేవీ ఈశ్వర్‌మూర్తి

దొంగ అరెస్టు.. బంగారు నగలు స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలకు పాల్పడే ఓ అంతర్‌జిల్లా దొంగను అనంతపురం గ్రామీణం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలను సీఐ శేఖర్ మీడియాకు వెల్లడించారు. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన అగ్రహారం రంగస్వామి అలియాస్ రంగ అనేవ్యక్తి పగటివేళ తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తుడు. ఈ ఏడాది ఆగస్టులో అనంతపురం గ్రామీణంలోని సోములదొడ్డిలో ఒకేరోజు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో చోరీ చేసిన నగలను బ్యాంకులో కుదువ పెట్టడానికి నగరంలోకి వస్తుండగా సీఐ శేఖర్, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 125 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గుత్తి, కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, డోన్ పోలీసుస్టేషన్లలో పలు దొంగతనాల కేసులున్నాయి. జైలుకు వెళ్లొచ్చాడు. దొంగను చాకచాక్యంగా పట్టుకున్న పోలీసులను అనంతపురం గ్రామీణం డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

☛ ఒకరి మృతి, నలుగురికి గాయాలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో గోరంట్లకు చెందిన సత్యం (38) మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. కోడుమూరు మండలం అమడగుంట్ల, చిల్లబండ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఏపీ శ్రీనివాసులు, బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. గోరంట్లకు చెందిన సత్యం భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎప్పటిలాగే పని చేసేందుకు కూలీలతో కలిసి ఆటోలో కర్నూలుకు వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. సరకు వేసుకుని గోరంట్ల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ట్రాక్టర్ మార్గమధ్యలో ఆటోను ఢీకొంది. దీంతో సత్యంకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన గిడ్డయ్య, వేణు, నాగరాజు, గిరినాయుడు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సత్యం (పాత చిత్రం)

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

అవగాహనతో ప్రమాదాల నివారణ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రహదారి భద్రతపై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. రహదారిపై గోతులు పూడ్చాలని, వర్షాలు కురుస్తున్నాయని, మురుగు కాల్వలు, మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి వసుంధర, మున్సిపల్ సహాయ అధికారిణి అనుపమ, ఆర్టీవో నాగేంద్ర, మోహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కరిస్తాం

హాలహర్వి, న్యూస్‌టుడే: ఎస్సీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. మేదేహాల్ గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దీనిపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై చర్చించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** హొళగుందలోని ప్రధాన రహదారి కోగిలతోటకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారింది. దోమల బెడదతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. **- రాజన్న, హొళగుంద**

సమాధానం: పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- రంగమ్మ, సర్పంచి, హొళగుంద**

హొళగుంద,న్యూస్‌టుడే: **సమస్య:** హెబ్బటం గ్రామంలోని ప్రధాన రహదారిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పరిసరాలంతా అపరిశుభ్రంగా మారి, దుర్వాసన వస్తోంది. **- మల్లికార్జున, హెబ్బటం**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం.

- రాజశేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, హెబ్బటం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలోని రోషన్ లాడ్జీ ప్రాంతంలో మహావీర్ మార్గ్ సర్కిల్‌లోని విద్యుత్తు స్తంభానికి కట్టిన ఫ్లెక్సీ అడ్డంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. **- రంగస్వామి, ఆదోని**

సమాధానం: ఫ్లెక్సీని తొలగించి ప్రమాదాల నివారణకు చొరవ చూపుతాం.

- కృష్ణ, కమిషనరు, ఆదోని పురపాలక సంఘం

చిప్పగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** కుందనగుర్తి బస్టాండ్ నుంచి గ్రామంలోని వెళ్లే మార్గంలో వీధి దీపాలు పునరుద్ధరించాలి. **- నాగేంద్ర, కుందనగుర్తి**

సమాధానం: కుందనగుర్తి బస్టాండ్ నుంచి వీధి దీపాలు త్వరలో ఏర్పాటు చేయిస్తాం.

- పురుషోత్తం, సర్పంచి, చిప్పగిరి

అసౌకర్యాల అద్దె గది..
ఆటాపాటకు చోటేది

మండలం	మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె భవనాలు
వెల్దుర్తి	63	21	29
ఆలూరు	52	45	06
ఆస్పరి	57	28	18

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండల కేంద్రంలోని 14వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రూ.10లక్షలతో గత తెదేపా ప్రభుత్వంలో పనులు ప్రారంభించారు. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఐదేళ్లుగా పనులు చేపట్టకపోవడంతో అంగన్‌వాడీ భవనం గోడలకే పరిమితమైంది.



ఆలూరు పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. కేంద్రంలో 20 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. సొంత భవనం లేక నెలకు రూ. 1,500 అద్దె చెల్లిస్తున్నారు. ఒకే గది ఉండటంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న ఒక్క గదిలోనే చిన్న గోడ కట్టుకుని వంట వండుతున్నారు. అందులోనే కేంద్రానికి సంబంధించిన సామగ్రి ఉంచారు.



ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం ఇది. 2016లో భవన నిర్మాణం చేపట్టారు. తరువాత నిధులు లేకపోవడంతో భవన నిర్మాణాన్ని గుత్తేదారుడు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. భవనానికి ప్రతి నెలా రూ.1,500 అద్దె చెల్లిస్తున్నారు.



❖ ముందుకు సాగని భవన నిర్మాణాలు
❖ అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి

ఆటలాడేందుకు చోటు కరవు.. కుదురుగా పడుకుందామంటే ఇరుకు గదులు.. ముద్ద దిగాలన్నా.. సేద తీరాలన్నా.. అక్కడే. రేపటి పౌరులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆటాపాటలతో విద్య, పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఐదేళ్ల చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉద్దేశం మంచిదే అయినా.. అద్దె భవనాలు, అసౌకర్యాలతో సతమతమవుతున్నారు. కొన్ని సొంత భవనాల్లో నిర్వహిస్తుండగా.. మరికొన్ని ఇతర గదుల్లో కొనసాగుతుండగా.. మిగిలిన కేంద్రాలన్నింటికీ అద్దె భవనాలే దిక్కు. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇది.

ఆలూరు, ఆస్పరి, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 307 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 149 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా.. 110 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 48 కేంద్రాలు పాఠశాలలు, గ్రామ పంచాయతీకి సంబంధించి గదుల్లో కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. దీంతో చేసేది లేక ప్రతి నెల రూ. వెయ్యి నుంచి రూ.2వేల వరకు అద్దె చెల్లిస్తూ.. నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గదులు సరిపోకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

పదేళ్లుగా ఇదే పరిస్థితి..

చిన్నారులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో పదేళ్ల కిందట అంగన్‌వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో భవన నిర్మాణాలు చివరి దశకు చేరాయి. తరువాత గుత్తేదారులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే వదిలేశారు. నియోజకవర్గంలో 17 భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాడు-నేడు కింద ఏడు భవన నిర్మాణాలు చేపట్టారు. ఇవి కూడా నత్తనడకన కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి మధ్యలోనే ఆగిన భవనాలతో పాటు నాడు-నేడు కింద చేపడుతున్న భవనాలు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేలా చూడాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

☛ మండల కేంద్రమైన వెల్దుర్తిలో సైతం 12లో కేవలం నాలుగు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. అంగన్‌వాడీ భవనాలు నిర్మించేందుకు స్థలాలు కేటాయించకపోవడంతో భవన నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

పల్లె కబుర్లు

మల్లెపల్లి (వెల్దుర్తి), న్యూస్‌టుడే: మల్లెపల్లి గ్రామంలో తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

కుప్పగల్ (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: కుప్పగల్ తాగునీటి పథకం ప్రత్యేక పైపులైన్ కోసం రూ. 566.90లక్షలు మంజూరు అయ్యాయని ఆదోని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మధుకృష్ణ ఆచారి తెలిపారు. తెదేపా నాయకులు విరుపాక్షి, జేసీ బంగారయ్య, రంగస్వామి బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈను కలిశారు. టెండరు పిలిచిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏఈ పేర్కొన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: గ్రామాల్లో విద్యుత్తు సమస్యలను పట్టించుకునే వారే కరవయ్యారని ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ, మహేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, బొమ్మనపల్లి సర్పంచి ఆంజనేయులు తదితరులు ధ్వజమెత్తారు. మద్దికెర మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏఈ మహేశ్వరరెడ్డి, తహసీల్దారు హుస్సేన్‌సాహెబ్, జడ్పీటీసీ సభ్యుడు మురళీధరరెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని ఆదోని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ జనార్దన్ అన్నారు. ఆదోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో అందుబాటులో పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.

ఆక్రమణల తొలగింపు సరికాదు

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలో ఆక్రమణల తొలగింపు పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాల చిరు వ్యాపారుల డబ్బాలు, దుకాణాలు తొలగించడం సరికాదని మైనార్టీ హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్‌అహ్మద్ బుధవారం అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండ ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి పేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు.

నిరుపేదలకు అన్నదానం

వెల్దుర్తి,న్యూస్‌టుడే: స్థానిక నారాయణరెడ్డి నగర్‌లోని నిరుపేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు గణం ఈశ్వర్, నవీన్‌రెడ్డి బుధవారం అన్నదానం చేశారు. ప్రతి ఒక్కరు సేవా గుణం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల పనులు ప్రారంభం

తుగ్గలి, న్యూస్‌టుడే: తుగ్గలి గ్రామంలో ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీకి వెళ్లే సిమెంట్ రహదారిని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, గ్రామ సర్పంచి రవి, స్థానిక నాయకులు వెంకటస్వామి, విజయ భాస్కర్, మధుబాబు, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అయోడిన్ లోపిస్తే... శారీరక సమస్యలు


మద్దికెర, న్యూస్‌టుడే: తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే పిల్లల్లో శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయని వైద్యాధికారిణులు శ్రీలక్ష్మి, రాగిణి పేర్కొన్నారు. మద్దికెరలో గురువారం ఇంటింటికి తిరిగి స్థానికులకు అవగాహన కల్పించారు.

ఉపకరణాల పంపిణీకి దరఖాస్తులు

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు రెండో సచివాలయంలో బుధవారం ఉపకరణాల పంపిణీ కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. డాక్టర్ గంగా భవాని, డాక్టర్ సాయి పూజిత తదితరులు దివ్యాంగులు, తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు అందుకున్నారు. దివ్యాంగులు దరఖాస్తులు అందించారని భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయుడు రామదాసు తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారికి ఉపకరణాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

చిన్నారుల రచనలు.. గెలుపు పాఠాలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలతో విద్యార్థుల్లో సామాజిక అంశాలపై అవగాహనతో పాటు నైపుణ్యాలు పెంపొందుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌నాయుడు అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పోటీల్లో భాగంగా బుధవారం ఆదోని పట్టణం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, పదో తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొని తమ సృజనకు పదునుపెట్టారు. అనంతరం ఈ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన జి.రాణి, ద్వితీయ సి.వైష్ణవి, తృతీయ బహుమతి కె.అమృత కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌నాయుడు, ఉపాధ్యాయులు గురురాజు, అబుదాబేగం, ఇందిరా ప్రియాంక, మధుసూదన్, ప్రమీలమ్మ, శ్రీనివాసులు ప్రదానం చేశారు.



ఆదోని పట్టణం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

పాలకమండలిలో బ్రాహ్మణులకు స్థానం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల పాలకమండలిలో ఇద్దరు బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ రాష్ట్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగరాజశర్మ బుధవారం తెలిపారు. ఇచ్చిన ఎన్నికల హామీని తు.చ. తప్పకుండా బ్రాహ్మణుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందన్నారు. కూటమి ప్రభుత్వ సారథులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రజకులు పోరాటాలకు సిద్ధం కావాలి



రజక సంఘం జెండాను ఎగురువేస్తున్న నాయకులు

ఆస్పరి, న్యూస్‌టుడే: రజకులు సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రామతీర్థంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సును బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో చేతివృత్తుల సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు హరికృష్ణ, నాగప్ప, విరుపాక్షి, పెద్దయ్య, కౌలుట్ల, నరసింహులు, గోపాల్, రఘునాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆదోని పురపాలక, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులో నిర్మించిన టిడ్కో నివాస సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులు సమస్యలపై అధికారులను నిలదీశారు. మొదటి విడత కింద ఇళ్లు మంజూరై, తాళాలు పొందిన వారితో గృహప్రవేశాలు చేయించాలని సంకల్పంతో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారుల అనుమానాలు నివృతి చేసి ఇళ్లలో చేర్పించాలనే ఉద్దేశంతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ప్రజలు పలు సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. తాగునీరు లేదని, తాము ఇళ్లలో నివాసం లేకపోయినా విద్యుత్తు బిల్లులు వస్తున్నాయని, ఎలా చెల్లించాలని ప్రశ్నించారు. అధికారులు సమస్యలు నమోదు చేసుకొని త్వరలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సహాయ కమిషనరు డాక్టరు అనుపమ, టిడ్కో డీఈ హరికృష్ణ, ఏఈ ప్రసాద్‌రావు, విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొలం బడితో రైతులకు మేలు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పొలం బడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి అన్నారు. కురవళ్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సునీత, వ్యవసాయ అధికారి వెంకటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు. ఆస్పరిలోని వెంకటసాయి ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయో మందులు జీ.2 చూపక పోవడంతో దుకాణంలోని రూ.48,800 ఎరువులను అమ్మకం చేయకుడదని నిలిపి వేసినట్లు దుకాణ యజమానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని హోసూరు రోడ్డున గల వృద్ధాశ్రమంలో బుధవారం మధ్యాహ్నం ప్రభాస్ అభిమానులు జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. మల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మందుగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, సిద్ద, ఆకుల సురేష్, కన్నయ్య, నాని, వెంకీ, మారుతి పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో బుధవారం సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ యువ సేన ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ఛలానా చెల్లించి ప్రజలకు ఉచితంగా ఒకపూట భోజనం అందించారు. తెదేపా రాష్ట్ర నాయకులు బుద్దారెడ్డి, అభిమాన సంఘం నాయకులు గోపి, శివ, రవి, షేక్షా, సుధీర్, వినోద్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయవాదులు, పోలీసులు, జర్నలిస్టులు, వైద్య విభాగం సభ్యుల మధ్య పత్తికొండ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం జరిగిన స్నేహపూర్వక క్రికెట్ పోటీలో పోలీసు జట్టు విజయభేరి మోగించింది. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించారు.

చిన్నారులకు దాతల ఆసరా



ఆర్థిక సాయం అందిజేస్తున్న దేవనకొండకు చెందిన దాతలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చందోలి గ్రామంలో నాలుగు రోజుల కిందట మృతి చెందిన లక్ష్మి కుమార్తెలకు దాతలు సాయమందించారు. దేవనకొండ మండలానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప, కె.విజయ రామరాజు మిత్ర బృందం బి.రామాంజనేయులు, మల్లికార్జున రెడ్డి, ధర్మతేజ, ఎం.నరేశ్ తదితరులతో కలిసి రూ.20వేలు బుధవారం చిన్నారులకు అందజేశారు.


కుంగదీస్తున్న కుండపోత
పంటలు వర్షార్పణం



నేల వాలిన జొన్న పంట

మద్దికెర, న్యూస్‌టుడే: మండలంలో కురుస్తున్న వర్షాలతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఇటీవలే సాగై మొలకెత్తిన శనగ పంటతో పాటు, జొన్న, ఉల్లి, మిరప తదితర పంటలు నీట మునిగాయి. పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, వెల్దుర్తి, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పరిధిలో 2.46 లక్షల ఎకరాల సాధారణ సాగు కాగా ఈ సారి కురిసిన వర్షాలకు 2.96 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అయితే ఖరీఫ్ ఆరంభం నుంచి అధిక వర్షాల కారణంగా సాగైన ప్రతి పంట దెబ్బతినిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొలక దశలో ఉన్న శనగ పొలాల్లో నీరు నిలవడంతో కుళ్లిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్విలో కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. బుధవారం సాయంత్రం వర్షం కురవడంతో జొన్న పంట నేలవాలింది. మండల కేంద్రంతో పాటు మేదేహాల్, అర్ధగేరి, నిట్రవట్టి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో ఏపుగా పెరిగిన జొన్న పంట నేలవాలడంతో పంట ఎదుగుదలకు ఇబ్బంది కలుగుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా హాలహర్వి - బాపురం, హాలహర్వి - నిట్రవట్టి రహదారి మధ్యలో వాగు ప్రవహించడంతో రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి.



బురుజుల వద్ద నీట మునిగిన జొన్న పంట



హంప వద్ద చెరువును తలపిస్తున్న శనగ పొలం

నిఘా కొండెక్కింది

హాలహర్వి మండల పరిధిలో బాపురం - గూళ్యం గ్రామాల మధ్య ఉన్న కొండలు అక్రమార్కుల తవ్వకాలతో కనుమరుగవుతున్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరికి వరంగా మారింది. కొన్ని



రోజులు కొండల్లో నుంచి ఎర్రమట్టి తరలిపోతోంది. స్థానిక అవసరాలు పేరుతో కొండలను కొల్లగొడుతూ.. సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిఘా 'కొండెక్కడంతో' ఇష్టానుసారంగా మట్టి తరలిస్తున్నారు. అక్కడ ఏర్పడిన గోతుల్లో నీరు నిలిస్తే.. మూగజీవాలకు ప్రమాదకరంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించకపోతే కొండలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటున్నారు.. **- న్యూస్‌టుడే, హాలహర్వి**

మేడం వస్తున్నారని.. మూసేశారు

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. 'మేడం వస్తున్నారు' అనే సమాచారం చెవిన పడటంతో.. నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలు చాలా వరకు మూసివేశారు. తెరచి



ఉన్న ఒకటి రెండు దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలకు తప్పనిసరిగా బిల్లులు అందించాలని సూచించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్టాక్ వివరాలు, దస్త్రాలు పరిశీలించారు. ఆమె వెంట ఆలూరు ఏడీఏ సునీత, ఏవో శివశంకర్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, గూళ్యం (హాలహర్వి)**

వెంటాడుతున్న ప్రమాదాలు

పశ్చిమ ప్రాంతంలో భారీ వాహనాలను ప్రమాదాలు వెంటాడుతున్నాయి. ప్రధాన రహదారుల్లో తరుచూ వాహనాలు బోల్తా పడుతున్నాయి. దేవనకొండ నుంచి కూరగా



యాలతో హైదరాబాద్‌కు బయల్దేరిన ఐచర్ వాహనం మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కరిడికొండ బస్‌స్టేజీ దగ్గర బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. బనవనూరు గ్రామానికి చెందిన రమేష్, దేవనకొండకు చెందిన కార్తిక్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తుగ్గలికి చెందిన రైతు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



నీటి నిర్వహణ గాలికొదిలేశారు

మద్దికెర, న్యూస్‌టుడే: అసలే వర్షాలు కురుస్తున్నాయి. రోగాలు ముసురుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజారోగ్యంపై పాలకులు, అధికారులు దృష్టిసారించడం లేదు. మద్దికెరలో తాగునీటి పథకాల నిర్వహణను గాలి కొదిలేశారు. అడ్డదిడ్డంగా రోడ్డు తవ్వేసి వాల్వ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి నాసిరకంగా ఉండటంతో లీకవుతూ తాగునీరు వృథా అవుతోంది. నీరు కలుషితం అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి వీధిలో ఇదే పరిస్థితి ఉందని, అధికారులు వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

☛ ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు


వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏడీఏ, సిబ్బంది

సమాచార హక్కు చట్టంపై అవగాహన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని వ్యవసాయ కార్యాలయ భవనంలో బుధవారం ఏడీఏ మహ్మద్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఏవో హేమలత సమాచార హక్కు చట్టంపై రైతుసేవా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్, అధికారుల పేర్లు ఫోన్ నెంబర్లు సమాచారం ప్రజలకు కనిపించేలా బోర్డు ఎదుట ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షఫీ, మహేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన భజన పోటీలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని చింతల మునిస్వామి, నల్లారెడ్డి స్వాముల ఆలయంలో నెల పూజ సందర్భంగా నిర్వహించిన భజన పోటీలు బుధవారం ముగిశాయి. పోటీలను టి.ప్రభాకర్‌నాయుడు ప్రారంభించారు. 19 భజన బృందాలు పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్, రామలింగయ్య, రాంగోవిందు, పాండురంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, ఓబులయ్య, లక్ష్మీకాంత్, చిన్నరంగస్వామి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంత్రాలయం : 98859 97892
గోనెగండ్ల : 80085 73827

సి.బెళగల్: **సమస్య:** కొత్తకోట గ్రామంలో సుంకులమ్మ ఆలయం నుంచి నారాయణరెడ్డి ఇంటి వరకు రహదారికి ఇరువైపులా కాల్వలు నిర్మించండి. - **రంగు వెంకటన్న, కొత్తకోట**

సి.బెళగల్: **సమస్య:** సంగాల గ్రామంలో పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి.
- **పెద్ద గోకారి సంగాల**

సమాధానం: ఏఈ వెంకటప్రకాశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. - **పై సమస్యలకు సి.బెళగల్ ఎంపీడీవో రాణెమ్మ సమాధానాలు ఇచ్చారు.**

అయోడిన్ లోపంతో ఎదుగుదల ఉండదు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అయోడిన్ లోపంతో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదని ఎంపీహెచ్ఈవో నరసప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వర్కూరులో ప్రపంచ అయోడిన్ లోపం, రుగ్మతల నివారణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ పర్యవేక్షకుడు కమాల్‌సాహెబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గోరంట్లకు చెందిన సత్యం మృతి చెందడంతో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం ఆయన ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట గోరంట్ల సర్పంచి బాలకృష్ణ ఉన్నారు.


మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతిలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

రీసర్వే లోపం.. భూములు మాయం

• గ్రామసభల్లో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

వైకాపా పాలనలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో అక్రమాలు, తప్పులపై నియోజకవర్గంలో బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. భూముల విస్తీర్ణం తగ్గిపోవడం, తమ భూములను ఇతర రైతుల ఖాతాలో చేర్చడం వంటి అంశాలపై ఫిర్యాదు చేసేందుకు రైతులు వరుస కడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని దరఖాస్తులు ఇచ్చేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం, గోనెగండ్ల



మండలం	గ్రామాలు	వినతులు
ఎమ్మిగనూరు	నాలుగు	279
గోనెగండ్ల	నాలుగు	283
నందవరం	నాలుగు	163

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం గ్రామాల్లో రీసర్వే చేసిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వారసత్వంగా దశాబ్దాలుగా అనుభవిస్తున్న భూముల కొలతల్లో తేడాలు రావడం, అనుభవం కింద ఉన్న భూమిని ఇతరుల పేరిట చూపడం వంటి వాటితో పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టింది. దీంతో చాలా మంది రైతుల మధ్య వివాదాలు, గొడవలకు కూడా దారి తీసింది. వారసత్వంగా వచ్చిన, కొన్న భూములు సాగు చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తుంటే రీసర్వే పేరిట తమ పొలం వద్ద లేకున్నా సర్వే చేసి రాళ్లు పాతడం, భూమి దస్త్రాల్లో కన్నా తక్కువగా చూపడం ఇలా ఇష్టానుసారం రెవెన్యూ సిబ్బంది కొలతలు వేశారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రీసర్వేలో జరిగినా తప్పులను సరిచేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలకు రైతులు వరుస కడుతూ వినతులు అందజేస్తుండటం గమనార్హం.

రూ.20 లక్షల భూమి కోల్పోయాను



– రామదాసు, ఎర్రబాడు, గోనెగండ్ల మండలం

నాకు మొత్తం 5.92 ఎకరాల భూమి ఉంది. రీసర్వేలో 1.70 ఎకరాలు మాయమైంది. సుమారు రూ.20 లక్షల విలువైన భూమిని రీసర్వేలో కోల్పోయాను. ఇటీవల మా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తు చేశాను. అధికారులు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను.

రెండెకరాలకు అర ఎకరం తగ్గింది



– జి.లక్ష్మి, కడివెళ్ల, ఎమ్మిగనూరు మండలం

నాకు రెండెకరాల భూమి ఉంది. పాసుపుస్తకం, రిజిష్టర్ పత్రాలన్నీ ఉన్నాయి. 11 ఏళ్ల కిందట భూమికి కొలతలు వేయించగా 2 ఎకరాలు ఉన్నట్లు సర్వే చేసిన రెవెన్యూ అధికారులు రాత పూర్వకంగా ఇచ్చారు. రీసర్వేలో అర ఎకరం భూమి తగ్గిందని చూపారు. దీనిపై మూడు రోజుల కిందట ప్రజా దర్బారు నిర్వహించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశాను. రీసర్వే గ్రామం కింద ఇంకా గ్రామసభ నిర్వహించాల్సి ఉందన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న విద్యా కమిటీ ఛైర్మన్ వెంకటేశ్

బురాన్‌దొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే మండలంలోని బురాన్‌దొడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బి.వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన విద్యార్థులు నవీన్‌కుమార్ (రగ్బీ), ఇంద్రజ (ఖోఖో), వీరేశమ్మ (సైక్లింగ్)లను పీడీ సత్య అభినందించారు. ప్రధానోపాధ్యాయిని నిర్మలా వసంతకుమారి పాల్గొన్నారు.

సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఓ సినిమా థియేటర్‌లో బుధవారం సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, లతీఫ్, శ్రీకాంత్, పృథ్వీ, సాయిబాలాజీ పాల్గొన్నారు.

తెగిన కల్వర్టు.. ప్రమాదం తెచ్చేట్టు



నిత్యం వాహనాలు, ద్విచక్ర వాహనాలు, విద్యార్థుల బడి బస్సు రాకపోకలు సాగించే చిలకలదోణ, బూదూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారి కింద కల్వర్టు కోసుకుపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. బూదూరు, తిమ్మాపురం, గ్రామాల ప్రజలు, విద్యార్థులు, అటు ఎమ్మిగనూరుకు, ఇటు మంత్రాలయానికి ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు, వర్షానికి కల్వర్టు రోడ్డు తెగి ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, చిలకలదోణ (మంత్రాలయం)

ప్రధాన రహదారి.. ఎలా వెళ్లేది



మండలంలోని గోరంట్ల గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గ్రామంలోని కోడుమూరు, వెల్దుర్తి ప్రధాన రహదారిపై వర్షం నీరు, ఇళ్లలోని మురుగుతో అపరిశుభ్రత తాండవిస్తోంది. వాహనాలు రాకపోకలు సాగించేప్పుడు మురుగు దుర్వాసన వస్తోందని సమీపంలో నివసిస్తున్నవారు వాపోతున్నారు. దోమలు, ఈగలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.
– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

వసుదేంద్రతీర్థుల ఆరాధనలో పీఠాధిపతి

మంత్రాలయం, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా శిరుగుప్ప తాలుకాలోని కెంచనగుడ్డలో పూర్వ పీఠాధిపతి వసుదేంద్రతీర్థుల మధ్యారాధనలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు కెంచనగుడ్డకు చేరుకున్న పీఠాధిపతికి మఠం అధికారులు, భక్తులు, స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, బళ్లారి ఎస్పీ శోభారాణి ఘనంగా స్వాగతం పలికారు. తుంగభద్ర నదిలో భక్తులతో కలిసి దండోదక స్నానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి సీసీ రోడ్డును ప్రారంభించారు.


దండోదక స్నానం చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

బృందావన ప్రతిమకు బంగారు పల్లకి సేవ

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం మృత్తికా బృందావన వెండి ప్రతిమను బంగారు పల్లకిలో ఊరేగించారు. అర్చకులు బృందావనానికి నిర్మాల్యం, విశేష పంచామృతాభిషేకం చేశారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు సాయంత్రం వెండి అంబారి, కొయ్య, వెండి రథం, బంగారు, రతాలపై మేళతాళాల మధ్య ఊరేగించారు.

వ్యాసరచన పోటీలతో ప్రతిభ గుర్తింపు





ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించడానికి దోహదపడుతాయని కస్తూరి పాఠశాల ప్రిన్సిపల్ సుజాత అన్నారు. బుధవారం ఈనాడు ఆధ్వర్యంలో కస్తూరి పాఠశాలలో ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడమైంది. 136 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గీతికశ్రీ (10వ తరగతి), లిఖిత (9వ తరగతి), రేఖశ్రీ (8వ తరగతి) సాధించారు. వీరికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పరమేశ్ పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: ప్రతి రైతు సాగులో విత్తనశుద్ధి పాటిస్తే మంచి దిగుబడులు పెందవచ్చని ఏవో మల్లేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఎక్కువ కొమ్మలతో అధిక దిగుబడి

గూడూరు, న్యూస్‌టుడే: ఏపుగా పెరిగిన కంది మొక్కల జుట్టు కత్తిరించడంతో ఎక్కువ కొమ్మలు వచ్చి అధిక దిగుబడి వస్తుందని డాట్ కేంద్రం శాస్త్రవేత్త ఎం.రవికిశోర్ పేర్కొన్నారు. గూడూరులో ఏవో శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి, డీఆర్సీ ఏడీ శశిధర్ రెడ్డి, ఏడీఏ వెంకటేశ్వర్లు పాల్గొని కంది, పొగాకు పంటలు పరిశీలించారు.

చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంటలకు పట్టిన చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలని ఏడీఏ సాలురెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. అమడగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం సర్పంచి వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, ఏవో రవిప్రకాశ్ పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలు త్వరితగతిన పరిష్కారం


రెవెన్యూ అధికారులు, సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

కౌతాళం, న్యూస్‌టుడే: రీసర్వేలోని భూసమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం మండలంలోని మదిరె గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మల్లికార్జున స్వామి, సర్వేయర్ బసవరాజుస్వామి పాల్గొన్నారు.

కోసిగిలో.. కోసిగి, న్యూస్‌టుడే: రీసర్వేలో తప్పొప్పులుంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం కోసిగిలోని 3వ వార్డులో తహసీల్దార్ నిత్యానందరాజ్, ఉప తహసీల్దార్ రుద్రగౌడ్ ఆధ్వర్యంలో పెండేకల్ గ్రామానికి చెందిన గ్రామసభను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. సర్పంచి అయ్యమ్మ, వీఆర్వో వీరేశ్, సర్వేయర్ వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కారానికే సభలు


మాట్లాడుతున్న జేసీ డా.బి.నవ్య

కె.నాగలాపురం (గూడూరు), న్యూస్‌టుడే: భూసమస్యల పరిష్కారానికే గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నామని జేసీ డా.బి.నవ్య అన్నారు. బుధవారం ఆమె మండలంలోని కె.నాగలాపురంలో తహసీల్దార్ కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. సభలను సద్వినియోగం చేసుకుని తప్పులను సరిచేయించుకోవాలని సూచించారు. సర్పంచి నయోమి, రీసర్వే డీటీ లోకేశ్వరరెడ్డి, ఉప తహసీల్దార్ బాలునాయక్, మండల సర్వేయర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపునకు చర్యలు


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజ్, ఏవో రాజు

కోసిగి, న్యూస్‌టుడే: పులికనుమ ఎత్తిపోతల పథకం పైపు పగిలిపోయి నీటిలో మునిగిన పత్తి పంట రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని తహసీల్దార్ నిత్యానందరాజ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సాతనూరు, జంపాపురం మధ్యలో పైప్ పగిలిపోయిన స్థలాన్ని పరిశీలించారు. నష్ట పరిహారానికి జలవనరుల శాఖకు సమాచారం అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏవో రాజు, వీఆర్వోలు బాలస్వామి, తిక్కస్వామి, హనుమంతు పాల్గొన్నారు.

పోలీసుల సేవలతో సమాజం ప్రశాంతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గూడూరు, న్యూస్‌టుడే: పోలీసుల సేవలతోనే సమాజంలో ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. పోలీసు అమరవీరుల దినం సందర్భంగా ఏపీఎస్పీ పటాలంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజ సేవలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైఫిల్ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పటాలం డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐలు ఎస్సైలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా తప్పదు


చెత్తబుట్ట అందజేస్తున్న పురపాలక సిబ్బంది

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో తోపుడుబండ్ల వ్యాపారులు చెత్తను రహదారులపై పడేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని తోపుడు బండ్ల వ్యాపారులకు చెత్తబుట్టలను పంపిణీ చేసి మాట్లాడారు. తోపుడుబండ్లు, చిరువ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బుట్టలో వేసి, దాన్ని పురపాలక సిబ్బందికి అందించి పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రఘువీర్

కౌతాళం, న్యూస్‌టుడే: అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి రఘువీర్ అన్నారు. బుధవారం ఆయన కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆగిపోయిన ఇళ్లను జనవరి లోగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వారికి వివరించాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు కొంత రుణ సాయం అందించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సోమన్న, డాటా ఎంట్రీ ఆపరేటర్ కల్యాణ్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఏఐకేఎస్ నాయకులు బుధవారం బస్టాండు ఆవరణలో ధర్నా చేపట్టారు. ఆ పార్టీ తాలూకా కార్యదర్శి భాస్కర్‌యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేశ్, అంజినయ్య, కుమ్మరి చంద్ర పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలులో ఎస్‌జీఎఫ్ అధ్వర్యంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన గుడ్‌బేస్ విద్యార్థులు ఫైజల్, వంశీ అర్హత సాధించినట్లు బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ ఎబెల్ తెలిపారు. వీరిద్దరూ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు సిద్ధం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: వలసల నివారణకు గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు పనులు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ నసురుద్దీన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీడీ అల్లీపీరన్, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ అనంతశయన, ఏఈలు శంకర్, సుధాకర్‌రావు, ఏపీవో మహ్మద్‌బాషా, ఏవో బాబుభాస్కర్, డాక్టర్ కార్తిక్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయింపు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో తస్లీమ్ అనే వివాహిత భర్త సాదిక్‌వలీ ఇంటి ఎదుట బుధవారం బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గోనెగండ్లకు చెందిన తనకు పదేళ్ల కిందట ఎమ్మిగనూరుకు చెందిన సాదిక్‌వలితో వివాహమైందని, తమకు ముగ్గురు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త వేధిస్తున్నారని తెలిపారు. తన భర్త మరో వివాహానికి యత్నిస్తున్నాడని, తనకు, పిల్లలకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యారు.

అవమానంతో ఆత్మహత్యాయత్నం

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన తెలుగు పెద్ద నరసన్నను అదే గ్రామస్థులు నాగేష్, నరసమ్మ, గోవిందు, కొండన్న, తిమ్మయ్య అవమానించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఎస్సై తిమ్మారెడ్డి బుధవారం పేర్కొన్నారు. నీ కొడుకు నీ మాట వినడు కాబట్టి నీవు చనిపోవడం మంచిదని నలుగురిలో హేళనగా మాట్లాడటంతో అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆయన కొడుకు వెంకట్రాముడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై విచారిస్తున్నామన్నారు.

చేతికందే ఎత్తులో మృత్యువు

• కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు


చెట్లకొమ్మల మధ్యలో విద్యుత్తు తీగలు


కిందకు వేలాడుతున్న తీగలు

గూడూరు నగర పంచాయతీలోని సంజీవయ్య నగర్‌లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. పన్నులు వసూలు చేసే అధికారులు పట్టించుకోవడం లేదని పురప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. కాల్వ అంచులకు పిచ్చిమొక్కలు, కంపచెట్లు దట్టంగా పెరిగాయి. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. పది అడుగుల ఎత్తులో వేలాడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, గూడూరు

○ సంజీవయ్య నగర్ చివరి కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఆ దారిగుండా భారీ వాహనాలు వెళ్లేందుకు తీగలు ప్రమాదకరంగా మారాయి. చేయి ఎత్తితే తగిలేంత కిందకు వేలాడుతూ చెట్ల కొమ్మల మధ్యలో ఉన్నాయి. నగర పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో స్థానికులు సొంతంగా డబ్బులు వెచ్చించి తీగలకు పైపులు ఏర్పాటు చేసుకున్నారు. చెట్లకొమ్మలు గాలులకు రాసుకుని విద్యుత్తు సరఫరా అవుతోందని చెబుతున్నారు.

వార్డు	5
నివాసాలు	206
మురుగు కాల్వలు	2 కి.మీ.
విద్యుత్తు స్తంభాలు	28

ముందుకు కదలని మురుగు

కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. వర్షం నీరు దారులపై ప్రవహిస్తోంది. ఇంటింటి చెత్తను తీసుకునేవారు వారంలో రెండుసార్లు వస్తున్నారు. మూడు రోజుల వ్యర్థాలను ఇంట్లో ఉంచుకోలేక స్థానికులు ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి పట్టణ శివారులోని డంప్ యార్డులో పారబోస్తున్నారు. దుర్వాసన భరించలేక ఎవరి ఇంటి ముందు వారే శుభ్రం చేసుకుంటున్నారు. సీసీ దారులు, కాల్వలున్నా శుభ్రం చేయకపోవడంతో కాలువల్లో మట్టి పేరుకుపోయింది.

పట్టించుకునే నాథుడే లేడు

– రాణెమ్మ, గూడూరు

విద్యుత్తు తీగలు బాగు చేయాలని అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకునే నాథుడే లేడు. కరెంటు బిల్లు రీడింగ్ తీసుకునేవారికి చూపించినా సమస్య పరిష్కారం కాలేదు. వర్షం కురిసినా, గాలులు వీచినా ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా జీవిస్తున్నాం.

చర్యలు తీసుకుంటాం

– నాగరాజు, కమిషనర్, గూడూరు

సిబ్బందిని పంపించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. కాల్వలు శుభ్రం చేయకపోయినా, చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించకపోయినా ఆ వార్డు కార్మికులపై చర్యలు తీసుకుంటాం. విద్యుత్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్తు తీగలను బాగు చేయిస్తాం.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు తిమ్మగురుడు, కార్యదర్శి వీరేష్ డిమాండు చేశారు. బుధవారం డీటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు నరసింహ, ఉరుకుందు, నరసప్ప, షమీవుల్లా పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కూలీ మృతి

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగిలోని కొండగేనిగేరి కాలనీకి చెందిన బెల్లం నర్సారెడ్డి (57) అనే వ్యక్తి వలస నిమిత్తం మంగళవారం కర్ణాటకకు వెళ్లారు. అక్కడ బుధవారం ఎప్పటిలాగే పనులకు వెళ్లేందుకు సిద్ధం కాగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దు

మంత్రాలయం, న్యూస్‌టుడే: యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దని మంత్రాలయం తహసీల్దార రవి అన్నారు. బుధవారం ఆయన సుజయీంద్ర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎన్నికల డీటీ గురురాజారావు, వీఆర్వోలు భీమన్నగౌడ్, రాజు, కళాశాల ప్రిన్సిపల్ రవి పాల్గొన్నారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సమాజానికి సేవ చేయాలి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు మొక్క అందజేస్తున్న విద్యార్థులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజానికి వైద్యులు సేవ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు వైద్య సీట్లు సాధించడంతో కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీదేవి, డైరెక్టర్ ప్రత్యూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలు అంశాలపై శిక్షణ

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (2025-26)లో భాగంగా శ్రీకాళహస్తి శిక్షణ కేంద్రంలో బుధవారం జరిగిన సదస్సుకు ఉమ్మడి జిల్లా నుంచి పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు హాజరయ్యారు. పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని శిక్షణకు హాజరైన ఎంపీడీవోలు తెలిపారు. కర్నూలు డీపీవో భాస్కర్, నంద్యాల జిల్లాకు చెందిన డీఎల్‌డీవోలు తదితరులు హాజరయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: సమస్య: బుధవారపేటలోని వీధుల్లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు

సమస్య: కల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల సమీపంలో రహదారులపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. – రమణ

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక సంస్థ అధికారులు

అవకాశాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సందీప్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఎయిన్‌మెన్ ఎంపికలు జరుగుతాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సెట్కూరు సీఈవో దీప్తి అన్నారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెట్కూరు-యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఎయిర్‌ఫోర్స్ అధికారులు సందీప్ తదితరులు ఎయిర్‌ఫోర్స్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు.

కలెక్టర్‌ను కలిసిన సంఘం ప్రతినిధులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కర్నూలు జిల్లా నూతన అధ్యక్షుడిగా సి.నాగరాజు, జిల్లా కార్యదర్శిగా ఎం.లక్ష్మీరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.రజనీకాంత్‌రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. వారు బుధవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ బి.నవ్య, జిల్లా రెవెన్యూ అధికారి చిరంజీవి, పరిపాలన అధికారిణి జయశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : అధిక వర్షాల కారణంగా చాలా ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, వీటికి మరమ్మతులు చేయాలని సీపీఐ నాయకులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి కోరారు. వారు బుధవారం నగరంలోని 29, 37, 38 వార్డుల్లో పర్యటించారు.

నిశీధి ప్రయాణం.. బతుకు అంధకారం

- సరిగా వెలగని వీధి దీపాలు
- తరచూ ప్రమాదాలతో ఆందోళన

మొత్తం వార్డులు : 52
వీధి దీపాలు : 25 వేలకుపైగా
సిబ్బంది : 20
ప్రతి నెలా విద్యుత్తు బిల్లు : రూ.70 లక్షలు
నిర్వహణ : నగరపాలక సంస్థ

పరిశీలన

కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రివేళల్లో చీకట్లు నెలకొనడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. - న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

కర్నూలు నగర పరిధిలో 6.5 లక్షలకుపైగా నివసిస్తున్నారు. 25 వేలకుపైగా వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణ, మరమ్మతులు, దీపాలు అమరిక తదితర పనులకు ప్రత్యేకంగా సిబ్బంది ఉన్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. చాలా కాలనీల్లో రాత్రివేళల్లో చీకట్లు అలుముకున్నాయి. ఎక్కడెక్కడ దీపాలు వెలగడం లేదో గుర్తించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కాలనీవాసులు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.



ఫిర్యాదు చేసినా..


సుద్దవాగు సమీపంలో గణేశ్ నగర్‌లోని ఓ వీధి పూర్తిగా చీకటిమయంగా మారింది. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం జనం నడిచి వెళుతుంటారు. వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో అధికారులు నిత్యం తిరుగుతున్నా సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. నగరపాలక కార్యాలయంలో ఫిర్యాదు చేసినా తగిన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

చీకట్లోనే రాకపోకలు



స్టాంటన్‌పురం, బాలాజీ నగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని ఓ వీధిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పగలే వెలుగుతున్నాయి. తమ ప్రాంతంలో రాత్రివేళల్లో వెలగకున్నా అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

నెలల తరబడి వెలగక..



నగరంలోని వినాయక ఘాట్ నుంచి కొత్త వంతెన, స్వామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారిలో 6 స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి రావడంతో భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు రహదారులు సరిగా లేకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోతున్నారు. – న్యూస్‌టుడే, వెంకటరమణ కాలనీ

సభలు వినియోగించుకోండి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరిగే సభల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తహసీల్దారు విద్యాసాగర్ అన్నారు. హుసేనాపురం గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై రైతుల సమస్యలను అధికారులకు వివరించారు. రైతులకు అండగా నిలవాలని కోరారు.

ఈవోపై కేసు నమోదు

ఈనాడు, కర్నూలు : ఓర్వకల్లు మండలం బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానం ఈవో డి.ఆర్.కె.ప్రసాద్‌పై ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. రూ.1.30 కోట్ల నిధులు పక్కదారి పట్టించిన కేసు నమోదు చేయకపోవడంపై 'ఆలయ ద్రవ్యం గల్లంతు' శీర్షికన ఈనెల 19న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదైన విషయం వాస్తవమేనని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి 'ఈనాడు'కు వెల్లడించారు.

మేటిగా రాణించి.. బహుమతులు సాధించి



శ్రీలక్ష్మి పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చని శ్రీలక్ష్మి పాఠశాల కరస్పాండెంట్ పి.శేషన్న అన్నారు. ఎన్‌ఆర్‌పేటలోని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. యు.వైష్ణవి (పదో తరగతి) ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థినులు పి.మనస్విని, ఆర్.ప్రణతి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఆయన బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



నారాయణ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులతో విద్యార్థినులు

'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లోని సృజనకు పదును పెడుతాయని మాధవనగర్‌లోని నారాయణ పాఠశాల ఏజీఎం అన్వర్‌బాషా అన్నారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎనిమిదో తరగతి విద్యార్థినులు ఎం.విజయ అమృత, ఎస్.అమూల్య ప్రథమ, ద్వితీయ, వి.లక్ష్మీప్రసన్న (తొమ్మిది) తృతీయ స్థానంలో నిలిచారు. వారికి ఆయనతోపాటు ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ తదితరులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కేసీ కాలువను నగరపాలక అధికారులు, జలవనరుల శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. మురుగు నీరు కలుస్తుండటంతో వారు చర్చించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నీటి సరఫరాకు సంబంధించి నిర్లక్ష్యంగా విధులు నిర్వహించినందుకు శిక్షణ ఏఈ ఎం.రామ్‌మోహన్‌కు ఒకరోజు వేతనం ఆపుతూ ఎస్ఈ రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొంగనపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి కొంగనపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. 91 మంది రైతులు వినతులు అందజేశారు. తహసీల్దారు ఆంజనేయులు, తెదేపా నాయకులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిశారు. నాగేశ్వరరావు యాదవ్, కురువ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: దేవాలయాల పాలకమండలిలో బ్రాహ్మణులకు స్థానం కల్పించేందుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకోవడంతో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు రామరాజు, నాగరాజశర్మ, వసంతకుమార్ తదితరులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తలముడిపి మహేష్ నాయుడు బుధవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న ముస్లింల శ్మశాన వాటికలో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని.. దీనిని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషాకు విన్నవించినట్లు ఆలిండియా ముస్లిం మైనారిటీ కౌన్సిల్ ఛైర్మన్ సయ్యద్ మహమూద్ పీర్ తెలిపారు. కలెక్టర్‌ను బుధవారం కలిసి మాట్లాడినట్లు చెప్పారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ డేటా, టెక్నాలజీ విభాగం ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన సయ్యద్ ఖలీద్ సైపుల్లాను అధిష్ఠానం నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని డీసీసీ అధ్యక్షుడు మురళీ కృష్ణ తెలిపారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీర్లతో సీఈ సుబ్బారెడ్డి బుధవారం అమరావతిలో ఈఎన్‌సీ కార్యాలయంలో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించినట్లు సమావేశానికి కర్నూలు ఎస్ఈ రామచంద్రారెడ్డి తెలిపారు.

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖకు చెందిన అన్ని జిల్లాల సీఈలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం అమరావతిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు సీఈ కె.కబీర్ బాషా హాజరయ్యారు.

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరులో ఇటీవల జరిగిన అంతర జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీల్లో క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-10 బాలుర ఆర్టిస్టిక్ విభాగంలో కనిష్క (కాంస్యం), బాలికల విభాగంలో సుప్రితశ్రీ (కాంస్యం), రిథమిక్‌లో మేథ (వెండి), నిధిశ్రీ (కాంస్యం) వినీల (కాంస్యం) సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

శాంతి భవాని ప్యానెల్ విజయం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. మంజులా దేవి ప్యానెల్, శాంతి భవాని ప్యానెల్‌కు మధ్య పోటీ జరగ్గా.. శాంతిభవాని ప్యానెల్ విజయం సాధించింది.. వైద్య కళాశాలలో ఎన్నికల అధికారిణి చెన్నమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ స్టాఫ్ నర్సులు 321 మంది ఉండగా 270 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షురాలిగా ఎం.లీలావతి విజయం సాధించారు. కార్యదర్శిగా బంగారు విజయం సాధించారు. ఉపాధ్యక్షురాలిగా శాంతిభవాని, కోశాధికారిణిగా లక్ష్మీనరసమ్మ గెలుపొందారు.



శాంతి భవాని ప్యానెల్‌కు అభినందనలు తెలుపుతున్న ఎన్జీవో సంఘం నేతలు

వంద శాతం అమలుచేయాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆస్పిరేషనల్ బ్లాక్స్ (హొళగుంద, మద్దికెర, చిప్పగిరి) మండలాల్లో నిర్దేశించిన 40 సూచికలను సంతృప్తికరస్థాయిలో వంద శాతం అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆస్పిరేషనల్ బ్లాక్స్ పురోగతిపై ఆయన బుధవారం అధికారులతో సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న ఇంటింటి కుళాయి కనెక్షన్లను త్వరితగతిన ఇవ్వాలని చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీవో హిమ ప్రభాకర్ రాజు, డీఎంహెచ్‌వో భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదం.. పరిష్కారం

కర్నూలు నేరవిభాగం న్యూస్‌టుడే : చిరిగిన నోటు విషయంలో ఇరువురి మధ్య నెలకొన్న వివాదాన్ని శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించింది. కర్నూలు జిల్లాకు చెందిన హేమంతేశ్వర మునిరాజు ఈనెల 2న కర్నూలు గాయత్రీ ఎస్టేట్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.5 వేలు తీసుకున్నారు. అందులో ఒక రూ.500 నోటు చిరిగినది రావడంతో ఆయన బ్యాంకు అధికారులను సంప్రదించగా మరో నోటు ఇచ్చేందుకు నిరాకరించారు. సదరు నోటు ఎక్కడా చెల్లకపోవటంతో శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించారు. ఇరువురికి తాఖీదులిచ్చిన శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, రాజబాబు వారి వాదనలు విన్నారు. చిరిగిన నోటుకు బదులుగా మరో నోటు ఇవ్వటంతోపాటు బ్యాంకు అధికారులు క్షమాపణ చెప్పటంతో ఈయన కేసు ఉపసంహరించుకున్నారు.

మురుగు ప్రవాహం.. రోగాలతో సహవాసం



కర్నూలు వైద్య కళాశాల ప్రాంగణంలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు బోరు వద్ద మురుగు నీరు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. – ఈనాడు, కర్నూలు

వ్యర్థాలు కదలక.. దుర్గంధం వదలక

కల్లూరు మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. రహదారి పక్కనే పెద్దఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. ఫలితంగా దుర్గంధం వెలువడుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



రాకెట్‌లా దూసుకెళ్తున్నారు

☛ బ్యాడ్మింటన్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : వారిద్దరూ అక్కాచెల్లెళ్లు. వీరు మొదటి నుంచి బ్యాడ్మింటన్‌పై దృష్టి సారించారు. నిత్యం సాధన చేస్తూ క్రీడపై పట్టు సాధించారు. వివిధ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నారు. మరిన్ని మెలకువలు నేర్చుకుని జాతీయస్థాయిలో ప్రతిభ చాటేలా అడుగులు వేస్తున్నారు.

మక్కువ పెంచుకుని..

కర్నూలు ఆదిత్య నగర్‌కు చెందిన జాహ్నవి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు సునీత, శ్రీనివాసాచారి. జాహ్నవికి మొదటి నుంచి బ్యాడ్మింటన్ అంటే ఎనలేని మక్కువ. గత కొన్నేళ్లుగా ఆమె సాధన చేస్తున్నారు. వివిధ పోటీల్లో పాల్గొని విజయాలు అందుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరులో నంద్యాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం అందుకున్నారు. గతేడాది నంద్యాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల పోటీల్లోనూ రాణించి కాంస్య పతకం గెలుచుకున్నారు. జాహ్నవి మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటేలా సాధన చేస్తున్నట్లు పేర్కొన్నారు.



జాహ్నవి

విజయమే లక్ష్యంగా..

స్రవంతి సైతం తన అక్క జాహ్నవిని స్ఫూర్తిగా తీసుకున్నారు. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె సైతం బ్యాడ్మింటన్‌పై మక్కువ పెంచుకున్నారు. అక్క వద్దే మెలకువలు నేర్చుకున్నారు. ఇటీవల నంద్యాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల పోటీల్లో రన్నర్స్ ట్రోఫీ అందుకున్నారు. గతేడాది నంద్యాలలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం గెలిచారు. ఈ ఏడాది జులైలో గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి షిప్పింగ్ పోటీల్లో సత్తా చాటారు.



స్రవంతి

పటాలంలో ఆయుధాల ప్రదర్శన

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నేపథ్యంలో కర్నూలులోని ఏపీఎస్పీ రెండో పటాలంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను సందర్శించి ఆసక్తిగా తిలకించారు. ఇన్‌ఛార్జి అదనపు దళాధిపతి మహబూబ్‌బాషా, సహాయ దళాధిపతులు సుధాకరరెడ్డి, షర్ఫుద్ధీన్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

మద్యం దుకాణాలు తొలగించాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జనసమూహంలో మద్యం దుకాణాలు ఉండటంతో పలువురు రహదారులపైనే మద్యం తాగుతున్నారని, చర్యలు తీసుకుని నియంత్రించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. వారు బుధవారం నగరంలోని జిల్లా మద్యనిషేధ, అబ్కారీశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందించారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు నిర్మల, జిల్లా కార్యదర్శి అలివేలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు.

సర్వే నివేదిక అందించండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: సాంకేతిక విద్యలో భాగంగా ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుచేయడం అభినందనీయమని బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ (బీవోజీ) ఛైర్‌పర్సన్ డాక్టర్ విజయ లక్ష్మి దేశ్‌మనే అన్నారు. కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలను ఆమె బుధవారం సందర్శించారు. అనంతరం రిజిస్ట్రార్ గురుమూర్తి ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, బోధన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ కళాశాల దత్తత తీసుకున్న గ్రామాల్లో కుటుంబ వైద్య చరిత్రపై సర్వే చేయడంతోపాటు నివేదిక అందించాలని సూచించారు.



సమావేశమైన అధ్యాపకులు

మార్కెట్‌యార్డు వద్ద ట్రాఫిక్ జామ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో కర్నూలు మార్కెట్ కమిటీ వద్ద బుధవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. ఉల్లిగడ్డల లోడు లారీలు, ట్రాక్టర్లు ఒకేసారి పెద్దసంఖ్యలో వచ్చాయి.

చీడపీడలపై అవగాహన అవసరం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: పంట సాగులో వచ్చే సమస్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని కొమరోలులో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.

అభిమానుల అత్యుత్సాహం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని పలు థియేటర్లలో 'ఈశ్వర్' చిత్రాన్ని ప్రదర్శించారు. నగరంలోని రాజ్ థియేటర్‌కు అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ప్రదర్శన సమయంలో అభిమానులు బాణసంచా కాల్చడంతో నిప్పు రవ్వలు ఎగిరాయి. ఫలితంగా థియేటర్‌కు కొంత నష్టం జరిగినట్లు సమాచారం.



బాణసంచా కాల్చుతున్న అభిమానులు

బాధితుడికి నష్టపరిహారం అందజేత

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : సేవాలోపం విషయంలో నెలకొన్న వివాదాన్ని శాశ్వత లోక్‌అదాలత్ సామరస్యంగా పరిష్కరించింది. కర్నూలు జిల్లాకు చెందిన మహేశ్వరరెడ్డి బేతంచెర్ల మండలం రంగాపురం ఎస్‌బీఐలో దస్తావేజులు తనఖా పెట్టి గృహ రుణం పొందారు. క్రమం తప్పకుండా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తూ 2022, అక్టోబరు 15వ తేదీనాటికి రుణం తీర్చేశారు. దస్తావేజులు ఇవ్వాలని పలుమార్లు కోరినా బ్యాంకు అధికారులు స్పందించలేదు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నష్టపరిహారం కింద రోజూ రూ.5 వేల చొప్పున రూ.26 లక్షలు పరిహారంగా ఇవ్వాలని బాధితుడు శాశ్వత లోక్‌అదాలత్‌ను సంప్రదించారు. శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, రాజబాబులు ఇరువురికీ తాఖీదులిచ్చి వారి వాదనలు విన్నారు. దస్తావేజులతోపాటు రూ.85 వేలు నష్టపరిహారం ఇవ్వటంతో వివాదం సమసిపోయింది.